భారంగా వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరచి గదిని కలియ చూశాడు.

గది మొత్తం కదులుతున్నట్టుగా, తాగి తూలుతున్నట్టుగా అనిపించింది.

స్ప్రింగ్ కాట్‌పై కూర్చుని స్టీరియో ఆన్ చేశాడు.

హార్ట్ బీటింగ్‌ను అధికం చేస్తూ బీటిల్స్ మ్యూజిక్ ....

"డామిట్.... ఐ మస్ట్ హావ్ సమ్‌థింగ్ ఎల్స్."

మత్తులో ఆ ఆలోచన గమ్మత్తుగా అనిపించింది.

మెత్తగా నడుచుకుంటూ శిల్ప గదిలోకి వెళ్ళాడు.

మోచేతిని కళ్ళపై వుంచుకుని ముగ్ధమోహనంగా నిద్రపోతోంది.

ప్రక్కకు తొలగిన పయ్యెదతో ఖజురహో శిల్ప స్నిగ్ధంగా చీర కట్టుకుని సింగారించుకున్నట్టుగా వుంది.

నిద్రాణమై వున్న కోర్కెల తేనెతుట్టను తట్టినట్టయింది.

మోహావేశంగా మీదికి వంగి పెదవులతో ఆమె అధరాలను శృతిమెత్తంగా స్పృశించాడు.

అదుపులేని తమకంతో ఆమె శరీరాన్ని నలిపేస్తూంటే మేలుకున్న శిల్ప అతని పట్టు విడిపించుకోవాలని విశ్వ ప్రయత్నంచేసింది.

ఏదో చెప్పాలని తెరచుకున్న ఆమె పెదవుల్ని నోటితో నొక్కేశాడు.

ఆమె ఊపిరి అందనట్టుగా ఉక్కిరి బిక్కిరి అయిపోయింది.

బలాన్నంతా కూడకట్టుకుని చేతుల్ని అతని ఛాతీకి ఆనించి కోపంగా నెట్టింది.

కొద్దిగా అతని పట్టు సడలింది.

అంతే .... ఆ అవకాశాన్ని జారవిడుచుకుని శిల్ప అయిష్టంగా ప్రక్కకు దొర్లింది.

కిరీటి మరింత కసితో ఆమె భుజాన్ని పట్టుకుంటుంటే "నానీకి ఏక్సిడెంటయింది." ఇందాకట్నుంచి చెప్పాలనుకున్న విషయాన్ని బయట పెట్టింది.

షాక్ తిన్నట్టుగా అచేతనంగా ఉండిపోయాడు.

మత్తు వదిలిన కిరీటి మీదకి లేచాడు.

"ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది ?" కిరీటి కంఠంలో గగుర్పాటు....

"మెడ మెట్ల పైనుండి జారి పడ్డాడట... అమెరికన్ హాస్పిటల్‌లో చేర్చారు. యోగేంద్ర ఫోన్ చేశాడు మీకోసం. నేను చూసి వచ్చాను."

ఆమె చెప్పటం పూర్తి కాకుండానే అతడు బయటకు నడిచాడు. ఆఘమేఘాలపై హాస్పిటల్‌కు చేరుకున్నాడు.

తలపై బ్యాండేజ్‌తో కళ్ళు మూసుకుని ఉన్న నానీని చూడగానే అతని గుండె చెదిరిపోయింది.

నిర్జీవ ప్రతిమలా బెడ్ ప్రక్కనే కూర్చుంది కన్య.

చేష్టలుడిగినట్టుగా నిలబడిన కిరీటిని బయటకు తీసుకెళ్ళిన యోగేంద్ర "ఏక్సిడెంట్

జరిగిన వేళకు  కాకతాళీయంగా నేను అక్కడే వున్నాను. తలనుంచి బ్లీడింగ్ ఎక్కువగానే అయింది. అయిదారు స్టిచెర్స్ పడ్డాయి. అఫ్‌కోర్స్ ప్రమాదమేమీ లేదన్నారు డాక్టర్" అంటూ జరిగిందంతా చెప్పాడు.

"ఎన్ని గంటలకు  జరిగింది ?" కిరీటి కంఠం జీరబోయింది. "వెంటనే  నాకెందుకు తెలియపర్చలేదు" అన్న ప్రశ్నకూడా కిరీటి ప్రశ్నలో అంతర్లీనంగా ద్యోదకమైంది.

"మీరు పార్టీలోవున్న విషయం నాకు తెలుసు... మీకు ఫోన్ చేస్తాననేసరికి  అనవసరంగా గాభరా పెట్టినట్టవుతుందని  వారించింది కన్య" సంజాయిషీ యిచ్చాడు యోగేంద్ర.

కిరీటి కళ్ళల్లో  చిప్పిలిన నీరు చూసి చలించిపోయాడు.

"ఏమిటిది... మరీ చిన్నపిల్లాడిలా ..." ఓదార్చబోయాడు.

"లేదు మిష్టర్ యోగేంద్రా... నానీకేమన్నా జరిగితే కన్య మనకు దక్కదు" గాద్గదికంగా అన్నాడు.

"గాడ్ యీజ్ గ్రేట్ మిష్టర్ కిరీటి! పరీక్షలు పెట్టి అల్లరి చేస్తాడేమో కానీ  అంత ఫూలిష్‌గా నిర్ణయాలు తీసుకుంటాడని నేననుకోను." గంభీరంగా  అన్నాడు యోగేంద్ర.

చీఫ్ సర్జన్‌తో వివరంగా  మాట్లాడిన  కిరీటి ఆ రాత్రికి  యోగేంద్రతో బాటు అక్కడే వుండిపోయాడు.

మరో వారం రోజులకల్లా నానీ బాగా కోలుకున్నాడు.

అయినా  ఇంకా  బలహీనంగా  వుండటంతో  హాస్పిటల్‌లోనే   మరికొన్ని  రోజులు ఉంచాలని నిర్ణయించాడు కిరీటి .

నానీ  హాస్పిటల్‌లో  వున్నంతకాలం  కన్య  మానసికంగా  కృంగిపోకుండా  గట్టిగా  కృషి చేసిన యోగేంద్ర కన్యతో పాటు నానీకి కూడా బాగా చేరువయ్యాడు.

అలసటన్నది యెరుగకుండా అహర్నిశలూ ఎంతో ఆత్మీయతను  కురిపించే యోగేంద్ర సాన్నిథ్యంలో కన్య మనసు యెంతో వూరటచెందేది.....

అయితే  యోగేంద్రతో  తను  కోరుకునేది  వట్టి  స్నేహం  మాత్రమే   అని  ఎంత సరిపెట్టుకుందామన్నా, కాదేమో అన్న ఆలోచన మరెక్కడో సుతిమెత్తగా తాకి అనుక్షణం ఆమెను  భయపెడుతూనే వుండేది.

## 21

నానీ హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయి  రెండు రోజులైంది.

అనారోగ్యంగా  వున్న నానీని చూసే నెపంతో  నానీ హాస్పిటల్లో వున్న నెల రోజులు శిల్ప సునాయాసంగానే గడిపింది.

మళ్ళీ ఎప్పటిలా దిగులు..... జడత్వం చోటు చేసుకున్నాయి శిల్పలో ....

గడచిన నెలరోజుల్లోనూ నానీకి ఏక్సిడెంట్ అయిన నాటి రాత్రి  కిరీటి ప్రవర్తన ఎన్నోసార్లు గుర్తొచ్చింది.

చెదిరిన సుందర స్వప్నంలా, పూర్తికాని ఓ మనిజ్ఞచిత్రంలా ఆమె మనో ఫలకం పై ముద్రవేసుకున్న ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా మైమరుపుతో పులకరించిపోయేది.

కిరీటి ఏ ఒక్కనాడైనా దగ్గరకు వస్తాడని ఆ మధురస్మృతి గురించి పరవశంగా ముచ్చటిస్తాడని ఎదురుచూసిన ఆమెకు నిరాశే మిగిలింది....

తాగిన మైకంలో తప్ప తను కోరి ఆ విధంగా ప్రవర్తించలేదన్న నిర్ధారణకు వచ్చి ఎంతో నిస్పృహకు లోనైంది.

రేయింబవళ్ళు తన ఉనికినే మరచి కన్య ధ్యాసలోనే బ్రతుకుతున్నాడన్న ఆలోచనతో ఆమె మనసు ఉడుకెత్తుకు పోయింది.

యోగేంద్రతో పాటు అంతా ఒకే కూటమిలో చేరి తనను కావాలని నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఉక్రోషంతో తన గుండె మంటనెలా చల్లార్చుకోవాలన్న వూహతో వేగిపోయింది.

అందుకే కిరీటిని కలవాలన్న ఉద్దేశ్యంతో ఒకనాడు యోగేంద్ర రాగానే "నీకుకూడా నేను శత్రువునైపోయానా బావా!" అంటూ నిలదీసింది.

శిల్ప అలా తనను ఎందుకు ప్రశ్నించిందో అర్థంకాని యోగేంద్ర ఆమె ముఖంలో తారాట్లాడుతున్న విషాదరేఖల్ని గమనించగానే మానసికంగా ఆమె ఎంత కృంగి పోతున్నదీ ఊహించ గలిగాడు.

ఆమెనలా చూడగానే అతని హృదయం ద్రవించింది.

"అందరూ నన్ను వెలేశారు.... నువ్వు కూడా ...." ఆమె కంఠం రుద్ధమైంది....

"ఛ ఛ .... ఏమిటి చిన్నపిల్లలా ...."

ఆమెనెలా ఓదార్చాలో తోచలేదు.....

"ఏదో ఆ స్కూల్ కన్‌స్ట్రక్షన్‌లో కాస్త బిజీగా వుండి రాలేకపోయాను .... ఇక నుండి రోజూ వస్తానుగా ...." అనునయనంగా అన్నాడు.

"నాకు పిచ్చెక్కేట్టుంది బావా... ఒక్క మూడురోజులు నాకోసం స్పేర్ చేయవా....? సీరియస్‌గా అడిగింది.

దేనికో అర్థం కాక పోయినా 'కాదంటే' ఎక్కడ బాధపడుతుందోనని 'అలాగే' అనేశాడు.

"అయితే పిక్చరుకి వెళదాం పద" మరో మాటకు అవకాశ మివ్వకుండా ముస్తాబై వచ్చింది.

నిజానికి యోగేంద్రకు అంత తీరికలేదు. కన్‌స్ట్రక్షన్ విషయంలో కొన్ని వివరాలు కనుక్కోవాలని వచ్చాడు... కిరీటి ఆఫీసునుండి బంగళాకి బయలు దేరాడని తెలియగానే.

శిల్ప మొండి వైఖరి బాగా తెలిసిన యోగేంద్ర మౌనంగా ఆమెను అనుసరించాడు.

డ్రైవరును అఖ్ఖర్లేదని చెప్పి తనే డ్రైవ్ చేస్తూ కారును బీచ్‌కి పోనిచ్చింది.

"సినిమాకని చెప్పి బీచ్ కెందుకు తీసుకొచ్చావు." అని అడగలేదు యోగేంద్ర... కారణం

ఇద్దరూ ఇసుకలో కూర్చున్నారు.

సాయంకాలం కావటంతో బీచ్ పసిపిల్లలతోనూ, జంటలతోనూ సందడిగా వుంది.

అస్తమయ సూర్యుని అరుణ కిరణాలు సముద్రంపై ప్రతిఫలిస్తూ వింత అనుభూతిని కలిగిస్తున్నాయి.

సముద్ర గర్భంలోకి చొచ్చుకు పోయిన ఓర్ హేండ్లింగ్ ప్లాంటు కన్వేయర్స్ నిర్విరామంగా ఓడను నింపుతున్నాయి.

ఇసుకలో పిచ్చి గీతలు గీస్తూ చాలాసేపు మౌనంగా వుండిపోయింది శిల్ప.

ఆమె ఏదో చెప్పాలని సందేహిస్తుందన్న విషయం గ్రహించాడు.

"ఏమైనా మాట్లాడు శిల్పా!" ఆమెను ప్రోత్సహిస్తున్నట్టుగా మందహాసం చేశాడు.

అప్పటికీ శిల్పలో చలనం లేదు.

"నాకు మౌనమంటే మహాభయం ... ప్లీజ్... ఏమన్నా మాట్లాడు."

"బావా " ఇసుకలోకి సూస్తూనే సీరియస్‌గా పిలిచింది.

"కిరీటి గురించి నీ అభిప్రాయం చెబుతావా "

ఏ జవాబు నాశించి శిల్ప ఆ ప్రశ్న వేసిందో ఒక పట్టాన అతనికి అర్థం కాలేదు.

బాగా ఆలోచించి, "సహృదయుడు, స్నేహశీలి.... అన్నింటికన్నా నీకు అనుకూలమైన భర్త " అన్నాడు.

శుష్కంగా నవ్వింది.

"ఆయన నాకు అనుకూలుడైన భర్తకాడు బావా.... ఏనాటిదో పగ తీర్చుకోవాలని వలపన్ని నన్ను కట్టుకుని సాధిస్తున్న మనిషి."

ఆమె అభియోగానికి అసలు కారణం ఏమిటో యోగేంద్రకు తెలియదు. అయినా ఆమె అభిప్రాయం పొరపాటు అని నచ్చచెప్పాలనుకున్నాడు. కిరీటి ఎంత ఉత్తముడో స్పష్టపరచాలనుకున్నాడు.

"శిల్పా!" సౌమ్యంగా పిలిచాడు.

"కిరీటి పై అలాటి దురభిప్రాయం ఏర్పడటానికి గల కారణం చెప్పగలవా?"

"నేను అనుభవిస్తున్న జీవితం "టక్కున జవాబిచ్చింది.

"ఒకవేళ కిరీటి కూడా నీ గురించి ఇలాగే అనుకుంటున్నాడేమోనని ఎప్పుడైనా ఆలోచించావా?"

ఆమె వెంటనే జవాబు చెప్పలేక పోయింది.

"కావాలని కట్టుకున్నాడు. ఒకవేళ అలా అనుకున్నా నాకు ఇబ్బంది లేదు."

"పిచ్చి శిల్పా! మరో ఇంటిని తగలబెట్టాననుకునే వాడు ముందు తన ఇంటికి నిప్పంటించుకోడు."

“అంటే...?”

“నీపై పగ తీర్చుకోవాలనుకున్నవాడు నిన్ను పెళ్ళి చేసుకుని  పరోక్షంగా తనపై తాను పగ తీర్చుకునే ప్రయత్నంచేయడు.”

“లేదు బావా... దీని వెనుక ఓ పెద్ద ప్రణాళిక  వుందన్నది నా నమ్మకం. ”

“ఏ ఆధారంతో అలా అనుకోగలుగుతున్నావు?”

“నాన్న గారి  అసహాయతను అధారం చేసుకుని డబ్బు రూపేణా  నాపై వల విసరటం.”

“నీపై ప్రేమ కావచ్చు.”

“నేనెంత సహకరించకపోయినా ఇంకా సహనాన్ని చూపటం ....”

“ఎప్పటికయినా నిన్ను తన దారిలోకి మళ్ళించుకునే  ఆశావాదం కావచ్చు.”

“లేదు బావా... ఆయన నవ్వు, అతని చూపు చూస్తుంటే అతన్నెప్పుడో ఎక్కడో చూసినట్టుగానూ..... ఎప్పటిదో పగ తీర్చుకోవాలని అతడు నా వెంట పడుతున్నట్టుగానూ... అందుకే  ఒక్కోమారు చేరువ కావాలని  నేను ప్రయత్నిస్తుంటే  కావాలని దూరం జరుగుతున్నట్టుగానూ...” భయం, ధైర్యం సమ్మిళితమైన కంఠంతో కలలో చెప్పుకుపోతున్న ఆమె ‘శిల్పా’ అన్న యోగేంద్ర పిలుపుతో అర్ధోక్తిలో ఆగిపోయింది.

అతడి కళ్ళల్లోనూ ఏదో గుర్తుకు తెచ్చుకోవాలన్న ప్రయత్నం ...

“యస్ శిల్పా! మిగతా అభియోగాల మాటెలా వున్నా కిరీటిని చూసిన తొలిక్షణంలో సరిగ్గా నీ కొచ్చిన అనుమానమే నాకు కలిగింది. నాకూ బాగా పరిచయస్తుడే అన్న భావం స్ఫురిస్తుంది. కాని ఎంత ప్రయత్నించినా గుర్తు చేసుకోలేక పోయాను.” వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకున్నాడు.

“ఆ రహస్యం భేదించగలిగితే  ఇందులోని కుట్ర కూడా  మనకు స్పష్ట మవుతుంది బావా!”